పదో తరగతి పరీక్ష పద్ధతిలో మార్పులు వద్దు

సాక్షి,సిటీబ్యూరో: ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి పరీక్ష పద్ధతుల్లో మార్పులు చేయకుండా పాత విధానంలోనే నిర్వహించాలని ఎస్‌ఎఫ్‌ఐ మేడ్చల్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్‌ సంతోష్‌ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 90 రోజుల ముందు పరీక్షల్లో మార్పుల నిర్ణయం తీసుకోవటం వల్ల విద్యార్థులు తీవ్ర గందరగోళానికి గురయ్యే అవకాశముంటుందన్నారు. పరీక్షల పద్ధతిలో తీసుకునే మార్పులను వచ్చే విద్యా సంవత్సరం నుంచి తీసుకుంటే విద్యార్థులు ఆ విధానంతో పరీక్షలకు సిద్ధమవ్వటానికి వీలుంటుందని తెలిపారు. పరీక్షల్లో ప్రస్తుత మార్పుల వల్ల మార్కులలో అసమానతలు పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఎంఎల్‌ఆర్‌ఐటీలో ఈక్వినాక్స్‌ 2కే24

దుండిగల్‌: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్‌ టెక్నాలజీ (ఎంఎల్‌ఆర్‌ఐటీ) కళాశాలలో ఈక్వినాక్స్‌ 2కే24 శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా పిచ్‌ డెక్‌ కాంపిటీషన్‌, ఇంక్యుబేషన్‌ ప్యానెల్‌ చర్చల శీర్షికతో ప్రపంచ సవాళ్లకు పరిష్కారాలను అందించారు. టాలెంట్‌ఫార్మ్‌ సహ వ్యవస్థాపకుడు పంకజ్‌ దివాన్‌, లైఫ్‌ సైన్సెస్‌ ప్రొఫెషనల్‌, వ్యవస్థాపకుడు డాక్టర్‌ సూరజ్‌, టీసీ చీఫ్‌ ఇన్నోవేషన్‌ అధికారి బాల ప్రసాద్‌ పెద్దిగారి, ఎస్‌ఏపీ డైరెక్టర్‌ మనీష్‌ గుప్తా విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. అదే విధంగా నూతన ఆవిష్కరణలు, వాటి ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు. ఈక్వినాక్స్‌ 2కే24 విద్యార్థుల్లో వ్యూహాత్మక ఆలోచనలను పరీక్షించడం, హస్టిల్‌మేనియా, మార్కెటింగ్‌ నైపుణ్యాలను ప్రదర్శించడం, క్రాస్‌రోడ్స్‌, టీమ్‌వర్క్‌ను ప్రోత్సహించడం తదితర లక్ష్యాలతో నిర్వహించడం జరిగిందన్నారు.

ప్రైవేట్‌ ఆసుపత్రులపై నజర్‌

- పకడ్బందీగా క్లినిక్‌ ఎస్టాబ్లిష్‌మెంట్‌ చట్టం అమలుకు చర్యలు
- 28 క్లినిక్‌లు, 7 డయాగ్నొస్టిక్‌ సెంటర్లను సీజ్‌ చేసిన ఆరోగ్య శాఖ
- ఇష్టారాజ్యంగా దోపిడీ.. రోగులకు తప్పని తిప్పలు




సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రైవేట్‌ ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. శివారుల్లో జాతీయ, రాష్ట్రీయ రహదారుల ప్రాంతాల్లో పదుల సంఖ్యలో అనుమతి లేని ప్రైవేట్‌ ఆసుపత్రులు దర్శనమిస్తున్నా పట్టించుకున్న వారే కరువయ్యారు. దీంతో వారి ఫీజుల దోపిడీకి అడ్డూ, అదుపు లేకుండా పోతోంది. ఒక ఆసుపత్రికి అనుమతి తీసుకొని రెండు, మూడేసి బ్రాంచ్‌లు తెరుస్తున్నారు. ఎలాంటి పరిశీలన, విచారణ లేకుండానే వైద్యారోగ్య శాఖ అనుమతులు ఇస్తుందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. జిల్లాలో వందల సంఖ్యలో క్లినిక్‌లు, ఆసుపత్రులు ఇలానే నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. మెడికల్‌ షాపునకు కన్సల్టెంట్‌ క్లినిక్‌ పేరిట ఈ ఆసుపత్రులు ఏర్పాటు చేస్తున్నారు. అవసరం లేకున్నా రకరకాల వైద్య పరీక్షలు చేస్తూ పేదల రక్తం పీల్చుతున్నారు. రోగుల నుంచి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్‌ ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్‌ సెంటర్లు, అల్ట్రా సౌండ్‌ సెంటర్లపై వైద్యశాఖకు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను పట్టించుకోకుండా ఉల్లంఘించిన ప్రైవేట్‌, కార్పొరేట్‌ ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్‌ సెంటర్లపై చర్యలకు జిల్లా వైద్యారోగ్యశాఖ నజర్‌ పెడుతోంది.

నిబంధనలు ఇలా..

అల్లోపతి ప్రైవేట్‌ మెడికల్‌ కేర్‌ ఎస్టాబ్లిష్‌మెంట్‌ చట్టం ప్రకారం ప్రైవేట్‌ ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్‌ సెంటర్లు, కన్సల్టెంట్‌ క్లినిక్‌లు, ఆయుష్‌ క్లినిక్‌లు, ఫిజియోథెరపీ కేంద్రాలు అన్నింటికి అనుమతి తప్పనిసరి. నిబంధనల ప్రకారం జిల్లా వైద్యారోగ్యశాఖలో దరఖాస్తు చేసుకోవాలి. అలా దరఖాస్తు చేసుకున్న ఆసుపత్రి, క్లినిక్‌, కేంద్రాల నిర్వాహకులు అందులో పనిచేసే వైద్యుల రిజిస్ట్రేషన్‌ తప్పనిసరిగా ఉండాలి. అగ్నిమాపక, పొల్యూషన్‌, మున్సిపల్‌ ట్రేడ్‌ లైసెన్స్‌తో సహా తదితర అన్ని రకాల పత్రాలు సరిగ్గా ఉన్నప్పుడే ఆసుపత్రుల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాల్సి ఉంటోంది.

ఫిర్యాదులతోనే తనిఖీలు.. చర్యలు

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో జిల్లా వైద్యారోగ్యశాఖ వైద్య బృందం ఉప్పల్‌, చిలుకానగర్‌, పీర్జాదిగూడ, చింతల్‌, నాచారం, బోడుప్పల్‌, కూకట్‌పల్లి, మల్లాపూర్‌, ఏఎస్‌రావునగర్‌, దమ్మాయిగూడ, దుండిగల్‌, మల్కాజిగిరి, సఫల్‌గూడ, కుషాయిగూడ, నాగారం, సైనిక్‌పురి, కుత్బుల్లాపూర్‌ ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న 28 క్లినిక్‌లను సీజ్‌ చేసింది. 7 డయాగ్నొస్టిక్‌, స్కానింగ్‌, అల్ట్రా సెంటర్లను కూడా జిల్లా వైద్యారోగ్యశాఖ మూసివేసింది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పలు ప్రైవేట్‌ ఆసుపత్రులకు షోకాజ్‌ నోటీసులు జారీ చేసింది. పలు కార్పొరేట్‌, ప్రైవేట్‌ ఆసుపత్రులకు రాజకీయ అండదండలు ఉండటంతో.. షోకాజ్‌ నోటీసులతోనే జిల్లా వైద్యారోగ్యశాఖ సరిపెడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల అనుమతి లేని క్లినిక్‌లు, ప్రైవేట్‌ ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్‌ సెంటర్లపై జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులతోపాటు ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు అందుతున్నాయి. రోగుల నుంచి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న సంఘటనలపై కూడా వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో కొనసాగుతున్న క్లినిక్‌లు, ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్‌ సెంటర్లు, ఫిజియోథెరపి, డయాగ్నొస్టిక్‌ సెంటర్లు, రీహాబిలిటేషన్‌ సెంటర్లపై చర్యలు తీసుకునేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ సిద్ధమవుతోంది. ప్రైవేట్‌, కార్పొరేట్‌ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌, అనుమతులు తదితర అంశాలపై కూడా వైద్యారోగ్యశాఖ ఆరా తీస్తోంది.

ఇష్టానుసారంగా ఫీజుల వసూళ్లు

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని ప్రైవేట్‌, కార్పొరేట్‌ ఆసుపత్రుల్లో ఇష్టారాజ్యంగా ఫీజుల వసూళ్లు మొదలుకొని వైద్య పరీక్షలు తదితర వాటిల్లో కొనసాగుతున్న దోపిడీని జిల్లా వైద్యారోగ్యశాఖ పసిగట్టింది. ప్రైవేటు, కార్పొరేట్‌ ఆసుపత్రుల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచిస్తోంది. ఈ బోర్డుల మీద ఫీజుల ధరల వివరాల పట్టికతో సహా డాక్టర్లు, సిబ్బంది, పడక మంచాల సంఖ్య వంటి సమాచారాన్ని పొందుపర్చాలని ఆదేశాలు జారీ చేసింది.

అనుమతిలేని సెంటర్లు ఎక్కువే..

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 2,600 పైగా ప్రైవేటు, కార్పొరేట్‌ ఆసుపత్రులు ఉండగా, ఇందులో రిజిస్ట్రేషన్‌తో సహా వివిధ అనుమతితో కొనసాగుతున్న ఆసుపత్రులు 1705 మాత్రమే ఉన్నాయి. ఎలాంటి అనుమతి లేని ప్రైవేట్‌ ఆసుపత్రులు 895 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ అంచనా వేస్తోంది. అనుమతులు ఉన్న ఆసుపత్రుల్లో వంద కంటే ఎక్కువ పడకలు (బెడ్స్‌) ఉన్న ప్రైవేటు ఆసుపత్రులు 48 ఉండగా, 20 నుంచి 100 పడకలు (బెడ్స్‌) ఉన్న ఆసుపత్రులు 317 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ పేర్కొంది. 20 పడకలు (బెడ్స్‌) ఉన్న ఆసుపత్రులు 294 ఉన్నాయి. అలాగే 712 పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్‌ సెంటర్లు, 180 డెంటల్‌ ఆసుపత్రులు, 46 ఫిజియోథెరపి సెంటర్లు, 08 రీహాబిలిటేషన్‌ సెంటర్లు, అనుమతి పొందిన స్కానింగ్‌ సెంటర్లు 628, అనుమతి లేనిసెంటర్లు 400 వరకు ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ అంచనా వేస్తోంది.

విచారణ జరుగుతుంది



ప్రభుత్వ నిబంధనలు, ప్రమాణాలు పాటించని, వసతులు కల్పించని పలు క్లినిక్‌లు, ప్రైవేట్‌ ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్‌ సెంటర్లపై విచారణ జరుగుతోంది. వసతులు లేకుండానే ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేసే ప్రైవేట్‌ ఆసుపత్రుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

– డా.రఘునాథ్‌స్వామి, డీఎంహెచ్‌ఓ

ఆల్‌ ఇండియా బాక్సింగ్‌ మెన్‌ అండ్‌ ఉమెన్‌ టీం ఎంపిక



ఎంపికైన ఆల్‌ ఇండియా బాక్సింగ్‌ మెన్‌ అండ్‌ ఉమెన్‌ టీమ్‌

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ యూనివర్సిటీలో ఆల్‌ ఇండియా బాక్సింగ్‌ మెన్‌ అండ్‌ ఉమెన్‌ టీమ్‌ను శుక్రవారం ఎంపిక చేశారు. సెక్రటరీ స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ ప్రొఫెసర్‌ ఎస్‌ఎస్‌ దిలీప్‌, ఫిజికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ నల్లగొండ అశోక్‌ ఆధ్వర్యంలో ఎంపిక జరిగింది. పంజాబ్‌లోని గురుకాశి యూనివర్సిటీలో జరిగే ఆలిండియా ఇంటర్‌ యూనివర్సిటీ బాక్సింగ్‌ ఛాంపియన్‌షిప్‌లో జేఎన్‌టీయూ జట్లు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. డిసెంబర్‌ 18 నుంచి 26 వరకు జరిగే ఆల్‌ ఇండియా బాక్సింగ్‌ ఛాంపియన్‌షిప్‌ పోటీలో ఈ జట్లు పాల్గొంటాయని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బండి రమేష్‌, వెంకటేశ్వరరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట్‌ డివిజన్‌లో నివాసం ఉంటున్న వెంకటేష్‌ రెడ్డికి రూ.2.50 లక్షల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును లబ్ధిదారుడి సోదరుడికి కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ అరుణ్‌, మున్సిపల్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ లక్ష్మయ్య, సాధుప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోమ్‌ టుడే ఫర్నిచర్‌లో బ్లాక్‌ ఫ్రైడే సేల్‌



బ్లాక్‌ ఫ్రైడే సేల్‌లో వివిధ రకాల ఫర్నిచర్‌ వస్తువులు

మూసాపేట: కూకట్‌పల్లి వై జంక్షన్‌ వద్ద ది చెన్నై సిల్క్స్‌ ప్రాంగణంలో హోమ్‌ టుడే ఫర్నిచర్‌లో బ్లాక్‌ ఫ్రైడే సేల్‌ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. అన్ని రకాల దేశీయ, విదేశీ మోడల్స్‌తో ఫర్నిచర్‌ అందుబాటులో ఉంది. విభిన్న రకాల ఆఫీస్‌ ఫర్నిచర్‌, టేకు మంచాలు, అన్ని అవసరాలకు అనుగుణమైన ఫర్నిచర్‌ లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సేల్‌ మూడు రోజుల పాటు ఉంటుందని, సెలెక్టెడ్‌ ఫర్నిచర్‌పై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

8 గొర్రెల మృత్యువాత

దుండిగల్‌: అనుమానాస్పద స్థితిలో 8 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన దుండిగల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. దుండిగల్‌ గ్రామానికి చెందిన జక్కుల నగేశ్‌ యాదవ్‌ గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల నగేశ్‌ తన గొర్రెలకు నట్టల మందు ఇచ్చాడు. శుక్రవారం గ్రామ శివారులో మేత మేస్తు మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. నట్టల మందు వికటించి గొర్రెలు మృతి చెందాయా?.. లేక విషపు ఆకులను తిని చనిపోయాయా? అన్నది పోస్టుమార్టం నివేదికలో తెలియాల్సి ఉంది. బాధితుడి ఫిర్యాదు మేరకు దుండిగల్‌ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



పర్వత వర్ధిని శివాలయంలో రుద్ర హోమంలో పాల్గొన్న భక్తులు

- ఘనంగా శివకల్యాణం
- పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

మోతీనగర్‌: కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మూసాపేట డివిజన్‌ శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, అభిషేకం, సామూహిక లక్ష తమల పాకుల పూజ, శివ కల్యాణం, కార్తీక మాస వన భోజనాలు నిర్వహించారు. కార్తీక మాసం నెల రోజుల పాటు నిరంతరం శివ నామ స్మరణతో ఆలయ ప్రాంగణమంతా మారుమ్రోగింది. ఎర్రగడ్డలోని పర్వతవర్ధిని శివాలయంలో మాస శివ రాత్రి సందర్భంగా ఏకాదశ రుద్ర హోమం, మృత్యుంజయ హోమం నిర్వహించారు.



తలంబ్రాలు పోస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు



సామూహిక లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న భక్తులు



పర్వతవర్ధిని శివాలయంలో..

సేల్స్‌ ఫోర్స్‌ మల్టీనేషనల్‌ సేవలు అభినందనీయం

పీఏసీ చైర్మన్‌ ఆరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: కంపెనీలు సామాజిక సేవలో భాగస్వాములవ్వాలని, సేల్స్‌ ఫోర్స్‌ మల్టీనేషనల్‌ కంపెనీ సేవలు అభినందనీయమని పీఏసీ చైర్మన్‌ ఆరెకపూడి గాంధీ అన్నారు. వివేకానందనగర్‌ డివిజన్‌ పరిధిలోని వేంకటేశ్వరనగర్‌ కాలనీలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సేల్స్‌ ఫోర్స్‌ మల్టీ నేషనల్‌ కంపెనీ సౌజన్యంతో సీఎస్‌ఆర్‌ ఫండ్స్‌ 10 లక్షల రూపాయలతో నిర్మించిన అదనపు తరగతి గదిని శుక్రవారం పీఏసీ చైర్మన్‌ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మంచిగా చదివి తల్లిదండ్రులకు, సమాజానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. నాయకులు కూడా ప్రభుత్వ పాఠశాలలకు ఏదో ఒక రూపంలో సహాయం చేస్తూ ఉంటే పాఠశాలల రూపురేఖలు మారుతాయన్నారు. కార్యక్రమంలో సేల్స్‌ ఫోర్స్‌ సంస్థ ప్రతినిధులు వైస్‌ ప్రెసిడెంట్‌ సుదీప్‌ కంచెర్ల, డైరెక్టర్‌ శ్రీనివాస్‌ చీదెళ్ల, డైరెక్టర్‌ సమల్ల చంద్ర, సీనియర్‌ మేనేజర్‌ పాండురంగారావు, స్వప్న, భగవాన్‌, నాయకులు ఎర్ర లక్ష్మయ్య, చంద్రమోహన్‌ సాగర్‌, ఎండీ ఇబ్రహీం, రవిసాగర్‌, నాగరాజు, గంగాధర్‌ సాగర్‌, రాములు సాగర్‌, వెంకటేశ్వర సాగర్‌, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సేల్స్‌ ఫోర్స్‌ మల్టీ నేషనల్‌ కంపెనీ ప్రతినిధులు, విద్యార్థులతో పీఏసీ చైర్మన్‌ గాంధీ

రైతులను తరలించేందుకు ఆర్టీసీ బస్సులు

నేడు మహబూబ్‌నగర్‌లో రైతు పండుగ సభ

సాక్షి,సిటీబ్యూరో: కొత్త ప్రభుత్వం పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం మహబూబ్‌నగర్‌లోని అమిస్తాపూర్‌లో నిర్వహిస్తున్న రైతు పండుగ బహిరంగ సభకు మేడ్చల్‌ జిల్లా నుంచి రైతులను పెద్ద ఎత్తున తరలిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ తెలిపారు. ఇందుకోసం మూడుచింతలపల్లి, అలియాబాద్‌, కీసర రైతు వేదికలు, మేడ్చల్‌ మండల వ్యవసాయ కార్యాలయం, ఎదులాబాద్‌లలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సంవత్సర కాలంలో ప్రజా ప్రభుత్వం రైతు రుణమాఫీతో పాటు రైతు భరోసా, ధాన్యం కొనుగోళ్లు, సన్న వడ్లకు బోనస్‌, రైతు భీమా తదితర పథకాల ద్వారా రూ.50 వేల కోట్లు రైతులకు అందించినట్లు ఆమె తెలిపారు.

రైతుల వేదిక వద్ద సీఎం సభ ప్రత్యక్ష ప్రచారం

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో కీసర, మూడుచింతలపల్లి మండల కేంద్రాలతోపాటు అలియాబాద్‌, (శామీర్‌పేట మండలం), ప్రతాప్‌సింగారం (ఘట్కేసర్‌ మండలం), రాయలాపూర్‌ (మేడ్చల్‌) రైతు వేదికల వద్ద వీడియో కాన్ఫరెన్స్‌ సెట్ల ద్వారా మహబూబ్‌నగర్‌లోని అమిస్తాపూర్‌ రైతు బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడే ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు చంద్రకళ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్‌



కుత్బుల్లాపూర్‌: లక్ష రూపాయలు విలువ చేసే గంజాయిని మేడ్చల్‌ ఎక్సైజ్‌ టాస్క్‌ఫోర్స్‌ అధికారులు స్వాధీనం చేసుకుని ఇద్దరి నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. జిల్లా ఎక్సైజ్‌ అధికారి షేక్‌ ఫయాజుద్దీన్‌ వివరాల ప్రకారం .. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం మచిలీపట్నం ప్రాంతానికి చెందిన బలగం నాగరాజు(33), బలగం అన్వేష్‌(33) కొంత కాలంగా నగరంలో గంజాయి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సుచిత్ర చౌరస్తాలో గంజాయిని కూకట్‌పల్లికి చెందిన రఫీకి విక్రయించేందుకు యత్నిస్తుండగా మేడ్చల్‌ ఎక్సైజ్‌ టాస్క్‌ఫోర్స్‌, కుత్బుల్లాపూర్‌ ఎక్సైజ్‌ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 8.749 కిలోల గంజాయి, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో పాల్గొన్న అసిస్టెంట్‌ ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ మాధవయ్య, సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ పవన్‌కుమార్‌రెడ్డి, హెడ్‌ కానిస్టేబుళ్లు వెంకటేశ్వరరావు, సత్తార్‌, కానిస్టేబుల్‌ సంజయ్‌లను అభినందించారు. ఈ మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించి కొనుగోలుదారుల వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేసీఆర్‌ ఓ చరిత్ర.. దానిని ఎవరూ చెరపలేరు

దుండిగల్‌: దుండిగల్‌: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ ఓ వ్యక్తి కాదని.. చరిత్ర అని.. ఆ చరిత్రను ఎవరూ చెరపలేరని శాసనమండలి మాజీ చైర్మన్‌ స్వామి గౌడ్‌ అన్నారు. దుండిగల్‌ మున్సిపాలిటీ గండిమైసమ్మలోని బీఆర్‌ఎస్‌ పార్టీ జిల్లా కార్యాలయంలో దీక్షా దివస్‌ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహంతో పాటు అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేసీఆర్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్‌ సచ్చుడో' అనే నినాదంతో తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను ఏకం చేస్తూ ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించిన రోజే ఈ దీక్షా దివస్‌ అని వివరించారు. 60 ఏళ్ల కాలంలో అన్ని రంగాల్లో వివక్షకు గురై ధ్వంసమైన తెలంగాణ ప్రాంతాన్ని కేంద్రం మెడలు వంచి రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్ల కాలంలోనే దేశ తలసరి ఆదాయాన్ని మించిన ఆదాయంతో కేసీఆర్‌ అభివృద్ధి చేశారన్నారు. నేటి కాంగ్రెస్‌ పాలకులు మాత్రం తెలంగాణ చరిత్రలో కేసీఆర్‌ను ప్రజలు మర్చిపోయేలా అభివృద్ధి చేస్తామంటూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

దీక్షా దివస్‌కు తరలిన బీఆర్‌ఎస్‌ శ్రేణులు

బీఆర్‌ఎస్‌ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన దీక్షా దివస్‌ కార్యక్రమానికి శుక్రవారం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఆయా డివిజన్‌లలో తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాల వేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన 10 సంవత్సరాల్లో ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో దేశంలోనే అగ్రగామిగా నిలిపారన్నారు. నాటి కేసీఆర్‌ ఆమరణ దీక్ష ఫలితమే నేటి స్వరాష్ట్రమన్నారు. నేటి ప్రభుత్వం అభివృద్ధిని పక్కదోవ పట్టించి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరకుండా చేస్తున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. – కూకట్‌పల్లి



దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ఆల్విన్‌కాలనీ నుంచి తరలిన కార్యకర్తలు



కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవి ఆధ్వర్యంలో ..



ఓల్డ్‌బోయిన్‌పల్లి నాయకులు, కార్యకర్తలతో కార్పొరేటర్‌ నరసింహ యాదవ్‌



మాజీ కార్పొరేటర్‌ తూము శ్రావణ్‌కుమార్‌, నాయకులు, కార్యకర్తలు